సాక్షి వరంగల్

మంగళవారం । 7 । మార్చి । 2023



గంజాయి విక్రయదారుల అరెస్ట్

వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయదారులు నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸



కొండచిలువల కలకలం

రాయపర్తి మార్కెట్ యార్డు వెనుకాల ఉన్న గొల్లకంచ ఎస్సారెస్పీ కాల్వలో నాలుగు కొండచిలువలు సోమవారం కలకలం రేపాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం $36.0^{0}/19.0^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి శిరీష



నర్సంపేట రూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నర్సంపేట జూనియర్ సివిల్ జడ్జి శిరీష అన్నారు. పట్టణంలోని బాలాజీ డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, నేరాలు లేని సమాజానికి కృషి చేయాలన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులపై జరుగుతున్న పలు రకాల సంఘవ్యతిరేక కార్యకలాపాలకు కారణం.. రాజ్యాంగం మనకు కల్పించిన చట్టాలపై కనీస అవగాహన లేకపోవడమేనన్నారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ, కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌రాజ్, ఏఓ సురేశ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘భూములు లాక్కోవడం సరికాదు’



గీసుకొండ: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పేరుతో రైతుల భూములను కారు చౌకగా తీసుకుని కంపెనీలకు అధిక మొత్తానికి అమ్మాలనే ప్రభుత్వ యోచన సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీమగాని సౌజన్య అన్నారు. సోమవారం శాయంపేటహవేలిలో బాధిత రైతులను కలిసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్కులో కైటెక్స్ కంపెనీకి ప్రభుత్వం రెండు పంటలు పండే సారవంతమైన రైతుల భూమిని ధారాదత్తం చేయాలని చూస్తోందన్నారు. రైతులకు ఎకరానికి రూ.10లక్షలు ఇచ్చి కంపెనీలకు రూ.80లక్షలకు ప్రభుత్వం విక్రయించడం సరికాదన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, ఎంపీటీసీ భిక్షపతి, నాయకులు రమేశ్, బొమ్మనపల్లి అశోక్ రైతులను పరామర్శించి.. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గోదాంల నిర్మాణానికి స్థల పరిశీలన



ఖానాపురం: మనుబోతులగడ్డ గ్రామంలో గోదాంల నిర్మాణానికి డీసీఓ సంజీవరెడ్డి సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో నూతన గోదాంల నిర్మాణానికి తీర్మానం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్థలానికి సంబంధించిన వివరాలతో నివేదికను ఇక్కడి సొసైటీ అధికారులు.. జిల్లా అధికారులకు పంపించారు. దీంతో డీసీఓ సంజీవరెడ్డి స్థల పరిశీలన చేసి.. సర్పంచ్ సోమయ్యతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆయన వెంట సొసైటీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పురాతన ఆలయం పరిశీలన



ఖానాపురం: అశోక్‌నగర్‌లోని పురాతన శివాలయాన్ని కేంద్ర పురావస్తు శాఖ అధికారి స్మిత సోమవారం పరిశీలించారు. సైనిక్ స్కూల్ సమీపంలో ఉన్న శివాలయాన్ని పరిశీలించిన ఆమె.. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయాభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అధికారులు కుమార్, మల్లేశం, బాబు పాల్గొన్నారు.

అన్ని హంగులతో వేడుకలు

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

ఒత్తిడి లేని విద్య అందించాలి

వర్మి కంపోస్టు తయారీపై శ్రద్ధ చూపాలి

- 10లో ▸

కంట్లో కారమే!

మార్కెట్‌లో మిర్చి ధర నిర్ణయం దళారులదే..

- అడ్తిదారులు చెప్పిన రేటుకే అమ్ముకుంటున్న రైతులు
- సరుకు నాణ్యతగా ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఏనుమాముల మార్కెట్‌కు 60వేల బస్తాలకుపైగా రాక



ఏనుమాముల మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన మిర్చి బస్తాలు

వరంగల్: మార్కెట్‌కు సరుకు విక్రయానికి వస్తున్న కొద్దీ దళారుల ప్రమేయం ఎక్కువవుతోంది. పెద్ద మొత్తంలో మిర్చి బస్తాలు వస్తే చాలు ధర పడిపోవడం రివాజుగా మారుతోంది. నాణ్యతగా ఉన్న తమ సరుకుకు మంచి రేటు వస్తుందనే ఆశతో మార్కెట్‌కు వస్తే అడ్తిదారుడు చెప్పిన ధరకే రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో ధరల నిర్ణయంలో దళారుల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుండగా.. ఆరుగాలం పంట పండించి అమ్మకానికి తెచ్చిన రైతులకు మాత్రం ఏమీ మిగలని పరిస్థితి నెలకొంది. సోమవారం వ్యవసాయ మార్కెట్‌కు పెద్ద ఎత్తున మిర్చి వచ్చిందన్న సమాచారం మేరకు సందర్శించగా.. పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. సీజన్ ప్రారంభంలో మిర్చి ధరలు రికార్డు స్థాయిలో పలకడంతో రైతులు ఉత్సాహంగా పండించిన వరకు వెంటనే మార్కెట్‌కు విక్రయానికి తరలిస్తున్నారు. దేశంలో మిర్చి నిల్వలు తగ్గడంతో అడ్తిదారులు నవంబర్ నుంచి కోల్డ్ స్టోరేజీల్లో సరుకు నిల్వ చేశారు. ప్రస్తుతానికి రోజుకు 100 నుంచి 1000 బస్తాలకు వరకు తీసుకొచ్చి విక్రయించడంతో ధరలు గరిష్టంగా నమోదయ్యాయి. తేజ రకానికి రూ.16వేల నుంచి రూ.21,800, యూఎస్–341 రకానికి రూ.22వేల నుంచి రూ.27వేల వరకు ధర చెల్లించారు. డిసెంబర్ రెండో వారం నుంచి కొత్త మిర్చి మార్కెట్‌కు రావడం మొదలైంది. దీంతో కోల్డ్ స్టోరేజీ మిర్చితోపాటు కొత్త మిర్చికి అధిక ధర చెల్లించేందుకు కొనుగోలుదారులు పోటీ పడ్డారు. ఈ మిర్చి కేవలం 500 నుంచి 3వేల బస్తాల వరకే మార్కెట్‌కు రావడంతో గరిష్ట ధరలను 5–10 బస్తాల వరకు వర్తింపజేస్తూ.. మిగిలిన మిర్చి తడిగా, మచ్చలు ఉన్నాయనే కారణాలు చూపుతూ రూ.12వేల నుంచి రూ.16వేల వరకు కొనుగోలు చేయడంతో రైతులు పెద్దగా ఇబ్బంది పడలేదు. సంక్రాంతి పండుగ తర్వాత మిర్చిని రైతులు పెద్ద మొత్తంలో మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీనిని దళారులు అవగాహన చేసుకుని నాణ్యత గల సరుకైనప్పటికి క్వింటాల్‌కు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా.. మార్కెట్‌కు 60వేల బస్తాలకుపైగా మిర్చి విక్రయానికి వచ్చింది.

నాణ్యత, తేమ బూచీ..

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది మిర్చి రైతుల పరిస్థితి. సరుకుకు ధరలు ఎలా నిర్ణయిస్తున్నారన్న విషయాలను మార్కెట్ అధికారులు పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయి. సరుకులో తేమ ఏ మేరకు ఉంది.. నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉన్నాయి.. అని నిర్ధారించడంలో స్పష్టత లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం ఒకే రకం ఉన్న మిర్చికి జెండా పాటలో క్వింటాల్‌కు రూ.21,100 నిర్ణయించి వెళ్లగా.. తర్వాత వచ్చిన అడ్తిదారులు తమకు రూ.18వేల వరకు ధర నిర్ణయించారని రైతులు ఆరోపిస్తున్నారు.

దిగుబడి రాలే...



రెండెకరాల మిర్చి తోట వేశాను. రూ.లక్ష పెట్టుబడి అయ్యింది. అకాల వర్షాలు, ఇతర కారణాలతో దిగుబడి తగ్గింది. గత వారం క్వింటాల్‌కు రూ.21వేల నుంచి రూ.22వేల వరకు పలికింది. ధరలు బాగున్నాయని మార్కెట్‌కు తీసుకొస్తే రూ.18వేల నుంచి రూ.19వేలు ఇస్తున్నారు. ఖర్చులు పోను మిగిలే అవకాశం లేదు.

– ఆకుతోట వెంకటేశ్వర్లు, మాధన్నపేట, నర్సంపేట

ధరలు తగ్గాయి..



ఏనుమాముల మార్కెట్‌కు తేజ రకం మిర్చి గత వారం తీసుకొస్తే క్వింటాల్‌కు రూ.21వేలు పలికింది. అదే సరుకు ఇప్పుడు తెస్తే రూ.18వేల చొప్పున ఇస్తున్నారు. ఎందుకు ధరలు తగ్గాయో అర్థంకాని పరిస్థితులు ఉన్నాయి. ఖరీదుదారుడు చెప్పిన ధరలకు ఇవ్వక తప్పడం లేదు. ఇంత కష్టపడినా ఏమీ మిగలడం లేదు.

– శేఖర్, రైతు, గోరికొత్తపల్లి, రేగొండ మండలం

గిట్టుబాటు ధర అందిస్తున్నాం..



పక్కనే ఉన్న ఖమ్మం మార్కెట్ కంటే మన దగ్గరే ఎక్కువ ధరలు లభిస్తున్నాయి. మిర్చి నాణ్యత, తేమను పరిశీలించి ధర నిర్ధారిస్తారు. క్వాలిటీ ఉన్న మిర్చికి ఎక్కువ ధర పలుకుతుంది. మన వద్దకు సుమారు 10 రకాల మిర్చి వస్తుంది. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు అధికారులుగా మేం సిద్ధంగా ఉన్నాం.

– బీవీ.రాహుల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి, వరంగల్

ప్రభల జాతర..

కొమ్మాలకు రాజకీయ ప్రభలే ప్రత్యేకం

- ఏపీలోని కోటప్పకొండ జాతర తరహాలో..
- పలు ఆంక్షలతో అనుమతించిన పోలీసులు



వామపక్ష పార్టీకి చెందిన రాజకీయ ప్రభ (ఫైల్)

గీసుకొండ: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర హోలీ పండుగ రోజు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. జాతరకు తొలిరోజు రాత్రి నుంచి వచ్చే రాజకీయ ప్రభ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సుమారు 50 అడుగులకు పైగా ఎత్తులో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై వీటిని రంగు కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి జాతరకు తరలించడంతో సందడిగా ఉంటుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీల ప్రభ బండ్లు జాతరకు ఎక్కువగా వస్తాయి. ప్రభల ముందు పార్టీ కార్యకర్తలు, నాయకులు డప్పుచప్పుళ్లు, మైకుల మోతతో నృత్యాలు చేసుకుంటూ తరలివస్తారు. 1974 నుంచే కమ్యూనిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న నర్సంపేట డివిజన్ నుంచి జాతరకు ప్రభలు అధికంగా రావడం ప్రారంభమైంది. వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ వారు ప్రభలతో వస్తూ గొడవలకు దిగుతుండటంతో కక్ష సాధింపునకు జాతర వేదికగా నిలిచేది. ఆ తర్వాత పలు పార్టీల వారు ప్రభలను జాతరకు తెస్తూ తమ ఆధిపత్యాన్ని చాటేవారు. ఆ తర్వాత జాతరలో గొడవలు జరుగుతుండటంతో పోలీసు శాఖ వారు కొన్నేళ్లుగా ప్రభలను జాతరకు తీసుకురావొద్దని నిషేధించారు. వారు నిషేధించినప్పటికీ జాతరకు రాజకీయ ప్రభ బండ్లు రావడం తగ్గలేదు. గత జాతరలో ప్రభలను తీసుకొచ్చిన నాయకులపై గీసుకొండ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈసారి జాతరకు ప్రభ బండ్లను అనుమతించాలని పలు పార్టీల వారు పోలీసులను కోరడంతో కొన్ని షరతులతో అనుమతించారు. దీంతో ఐదు రోజుల నుంచే ప్రభలను సిద్ధం చేసే పనుల్లో ఆయా పార్టీల వారు నిమగ్నమయ్యారు.

రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు..

ఒక్కో ప్రభను తయారు చేసి జాతరకు తరలించడానికి సుమారు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. కొమ్మాల స్టేజీ నుంచి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల ప్రభలు బయలుదేరి ఆలయ ఆర్చి గేట్‌లోకి ప్రవేశించి గుట్టచుట్టూ తిరుగుతాయి. ఏపీలోని గుంటూరు జిల్లా కోటప్పకొండ జాతర తరహాలో కొమ్మాల జాతరకు వచ్చే రాజకీయ ప్రభలు ప్రత్యేకంగా ఉంటాయి. కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయచందర్‌రెడ్డి కొమ్మాల స్టేజీ నుంచి బయలుదేరే ప్రభలకు అయ్యే ఖర్చును భరిస్తుండగా.. బీఆర్‌ఎస్ నుంచి వెళ్లే ప్రభకు స్థానిక లీడర్లు, సర్పంచ్‌లు ఆర్థిక వనరులు సమకూర్చుకుంటున్నారు. ముఖ్యంగా కొమ్మాల బస్‌స్టేజీ, గిర్నిబావి సెంటర్ వరకు వచ్చిన ఆయా పార్టీల ప్రభలు వరుసగా ఆర్చి గేట్ నుంచి జాతరలోకి ప్రవేశిస్తాయి. ఈ సందర్భంగా వరంగల్–నర్సంపేట రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ విషయంలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా.. తాము విధించిన షరతులను అతిక్రమిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఈస్ట్‌జోన్ డీసీపీ పి.కరుణాకర్ ఇటీవల జరిగిన పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్చరించారు. రాజకీయ ప్రభలే కాకుండా సంప్రదాయంగా గడ్డితో చేసిన ఏనుగు, పులి, సింహం, ఒంటె బొమ్మలను ఎడ్ల బండ్లపై ఏర్పాటు చేసి భక్తులు జాతరకు వస్తారు.

ఇవీ ఆంక్షలు..

- రాజకీయ ప్రభలను తీసుకొచ్చే వారికి పోలీసు అనుమతి తప్పనిసరి.
- ప్రతీ బండి ఆరుగురికి తగ్గకుండా సభ్యులతో కమిటీగా ఏర్పడి పూర్తి బాధ్యత వహించాలి.
- పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు ప్రభ బండ్లకు పెట్టొద్దు.
- తప్పనిసరిగా మైక్ పర్మిషన్ తీసుకోవాలి. ఒక స్పీకర్ లేదా మైక్ మాత్రమే ఉండాలి.
- డీజేలకు అనుమతి లేదు.
- ప్రభలను తీసుకొచ్చే వాహనాలకు అన్ని పత్రాలు సరిగా ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనం నడపాలి.
- మద్యం సేవించి ప్రభ బండిని నడపొద్దు.
- బండి వద్ద ఏదైనా అల్లరి, గొడవలు జరిగితే ప్రభ బండి కమిటీదే బాధ్యత. వారిపైనే పోలీసులు కేసులు నమోదు చేస్తారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి: పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మున్సిపాలిటీలో ఈనెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, వీఓఏలు, పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కేటీఆర్ వస్తున్నారని, అందుకోసం నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చేలా జన సమీకరణ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, డీఆర్‌డీఓ సంపత్‌రావు, ఎంపీడీఓ కిషన్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతులు పరిష్కరించాలి

- కలెక్టర్ గోపి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గోపి

వరంగల్ రూరల్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులను క్షుణ్ణంగా పరిశీలించి.. పరిష్కరించాలన్నారు. అలాగే వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందుల్లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి అందేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించి 20, ఆర్డీఓ వరంగల్ 7, జీడబ్ల్యూఎంసీ 5తోపాటు తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 68 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, ఆర్డీఓ మహేందర్ జీ, డీఈఓ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

కళాధ్వనిగా స్ప్రింగ్‌స్ప్రీ–23



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది నిర్వహించే వసంతోత్సవం స్ప్రింగ్‌స్ప్రీ–23ని ఈసారి కళాధ్వనిగా నామకరణం చేశారు. కాలేజీలోని టైమ్‌స్కేర్ ప్లాజాలో సోమవారం డైరెక్టర్ ఎన్వీ.రమణారావు ముఖ్య అతిథిగా హాజరై ఆ థీంని ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమం ‘సంస్కృతి ప్రతిధ్వనిస్తుంది’ అనే ట్యాగ్‌లైన్‌తో సంస్కృతీ సంప్రదాయాల వేదికగా నిలవాలని అన్నారు. డ్యాన్స్, మ్యూజిక్, థియేటర్ ఆర్ట్, స్పోర్ట్స్‌తోపాటు వివిధ రకాల సంస్కృతీ సంప్రదాయాల ప్రదర్శనలు, ఈవెంట్లతో అలరించనుందని డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వయిజర్ హీరాలాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పదివేల మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

స్ప్రింగ్‌స్ప్రీ–23 థీం ఆవిష్కరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లాష్‌మాబ్‌లో విద్యార్థులు ‘డీజే కొట్టు నా బోటే ఎక్కు బాసు వేర్ ఇజీద పార్టీ, ఏ బిడ్డా ఇది నా అడ్డా, ఓ సీతా వదలను నేనింక, అయారే అయా స్ప్రింగ్‌స్ప్రీ అంటూ’ ఉత్సాహంగా చిందులు వేశారు.

సైన్స్ టాలెంట్ హంట్

- 10న రీజినల్ సైన్స్ సెంటర్‌లో పరీక్ష
- 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవకాశం

కాశోజీ సెంటర్: జిల్లా విద్యా శాఖ, రీజినల్ సైన్స్ సెంటర్ సంయుక్తంగా జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ హంట్–2023 లెవల్–2 పోటీలు ఈనెల 10న హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా టాలెంట్ హంట్‌కి సంబంధించిన లెవల్–1 ఆన్‌లైన్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 1,300 మంది రాశారు. ఇందులో మొదటి 67 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 10న లెవల్–2 పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని 13 మండలాల నుంచి ఎంపికైన ఆయా విద్యార్థులు కచ్చితంగా పాల్గొనేలా చూడాలని వారి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఇప్పటికే సూచించారు. విద్యార్థులు, టీచర్లకు భోజన వసతి కూడా కల్పిస్తున్నారు. కాగా.. ఎంపికైన విద్యార్థులు తమ ఎస్కార్ట్ టీచర్లతో పోటీలకు హాజరుకావాల్సి ఉంటుంది.

లెవల్–2 పరీక్ష వివరాలు ఇలా...

రౌండ్ 1–పేపర్ పెన్ టెస్ట్(లిఖిత పరీక్ష)

- పాఠశాలల్లో ఆన్‌లైన్ ద్వారా ఎంపికైన 67 మంది విద్యార్థుల నిజసామర్థ్యం పరీక్షించడానికి పరీక్ష ఉంటుంది. దీని నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులు తర్వాతి రౌండ్‌లోకి వెళ్తారు.

రౌండ్ 2–ప్రయోగ కౌశలాల పరీక్ష

- విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రయోగ కృత్య హస్తలాఘవ కౌషలాలను పరీక్షించడానికి 20 మందికి ఒక ప్రయోగం చొప్పున ఇస్తారు. ఈ పరీక్ష అనంతరం తర్వాత స్థాయికి 10 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు.

రౌండ్ 3–ఆశు ఉపన్యాసం

- పోటీకి ఐదు నిమిషాల ముందు ఇచ్చే సైన్స్ అంశంపై ఐదు నిమిషాలపాటు ఉపన్యాసం ఇవ్వాల్సి ఉంటుంది.

విద్యార్థులకో వేదిక..



సైన్స్ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని విద్యార్థులకు సైన్స్ ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నాం. తమ ప్రతిభను ప్రదర్శించుకోవడానికి ఇదొక వేదిక. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునే విధంగా అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. మరింత సమాచారం కొరకు 98488 78455 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థిని కాలు కొరికిన ఎలుకలు



ఎలుక కొరికిన పీజీ విద్యార్థిని పాదం మడిమ

కేయూ క్యాంపస్: కేయూ మహిళా హాస్టల్ డీ బ్లాక్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థిని పాదం మడిమను ఆదివారం రాత్రి ఎలుకలు కొరికాయి. విద్యార్థిని ఆదివారం రాత్రి పడుకున్న సమయంలో కొరికినట్లు హాస్టల్ సిబ్బందికి తెలపగా.. టీటీ వేయించుకోవాలని సూచించినట్లు సమాచారం. ఎలుక కొరికిన విషయమై ఆ విద్యార్థిని సంబంధిత విభాగం ప్రొఫెసర్ల దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. అంతకుముందు రోజు కూడా మరో విభాగం విద్యార్థినిని కూడా ఎలుకలు కొరికినట్లు తెలుస్తోంది. మహిళా హాస్టల్‌లోని డీ బ్లాక్‌లో ఎలుకలు ఉన్నాయని విద్యార్థినులు చెబుతున్నా వాటిని నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మహిళల గౌరవంతోనే సమాజాభివృద్ధి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్



మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్

వరంగల్ (పర్వతగిరి): మహిళలు పురుషులతో సమానంగా గౌరవం పొందినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జేఆర్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం మహిళా ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల మహిళా అధికారులు, సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టుక అనేది ఎవరు తమకు తాము నిర్ణయించుకునేది కాదన్నారు. అందుకే స్త్రీ, పురుష తారతమ్యం, కుల వివక్ష లేకుండా అందరినీ గౌరవించాలన్నారు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతో వారికి సమాజంలో సముచితం స్థానం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సంపత్‌రావు, ఎంపీపీ కమల, జెడ్పీటీసీ సింగ్‌లాల్, తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ చక్రాల సంతోశ్‌కుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, సర్పంచ్ చింతపట్ల మాలతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహితంగా నిట్



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌ను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలుద్దామని కాజీపేట ఏసీపీ పి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ర్యాగింగ్ నివారణపై, ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలపై డైరెక్టర్ ఎన్వీ.రమణారావు, సిబ్బందితో ఏసీపీ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహనతోపాటు కలిగే దుష్పరిణామాలను తెలియజేయాలని, యాంటీ ర్యాగింగ్ టీంను ఏర్పాటు చేయాలని సూచించారు. పలు హాస్టళ్లలోని విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి యాంటీ ర్యాగింగ్ వాల్‌పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డులో సోమవారం సెల్‌ఫోన్ దొంగలిస్తున్న ఓ వ్యక్తిని సెక్యూరిటీ గార్డులు పట్టుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే..ఆస్పత్రిలోని పిల్లల వార్డులో సోమవారం తెల్లవారు జామున ఓ వ్యక్తి సెల్‌ఫోన్ దొంగలిస్తున్నాడు. గమనించిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ శ్రీనివాస, రమేశ్‌లు అతన్ని పట్టుకుని ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు.

కేయూలో మెస్ బంద్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో పీజీ కోర్సుల విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తున్న విషయం విదితమే. కామన్‌మెస్‌లో మరమ్మతులు పూర్తికాగా అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి సామాన్లు, ఫర్నీచర్‌ను కామన్‌మెస్‌లోకి తీసుకొస్తున్నామని అందుకు సోమవారం నుంచే మెస్ సదుపాయాన్ని యూనివర్సిటీ అధికారులు బంద్ చేశారు. అల్పాహారం కూడా పెట్టలేదు. రేపటి వరకు భోజనం కూడా బంద్ చేస్తారని, రాత్రి డిన్నర్ నుంచి రీఓపెన్ చేయనున్నట్లు సమాచారం. కేవలం అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి కామన్‌మెస్‌కు సామాను షిఫ్టింగ్‌కు మూడు రోజుల పాటు మెస్ సౌకర్యం బంద్ చేయటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కామన్‌మెస్‌ను రీ ఓపెన్ చేయాలని విద్యార్థులు ఇటీవల ఆందోళన చేసిన విషయం విదితమే. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు కూడా ఇటీవల సందర్శించి త్వరలోనే రీ ఓపెన్ చేస్తామని ప్రకటించారు. సామాను షిఫ్టింగ్ పేరుతో మెస్ బంద్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

రంగుల పండుగ వచ్చేసింది..



మోదుగు పూల చెట్టు



రంగుల అమ్మకాలు

- సహజ సిద్ధమైన రంగులే మేలు
- స్నానానికి చెరువులు, వాగులు, కుంటలకు సరదాకు వెళ్లి.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

నేడు హోలీ

జనగామ: తెలుగు నెలల్లో చివరకి వచ్చే పాల్గుణ మాసం పౌర్ణమి రోజున హోలీ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చతుర్దశి నాడు కాముని దహనం నిర్వహించి మరుసటి రోజు రంగుల హోలీ జరుపుకుంటారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగల్లో హోలీ ఒక్కటి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ వేడుకలు జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. రంగులు చల్లుకోవడంతో పాటు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సహజరంగులే మేలు

హోలీ వేడుకల్లో ప్రాణాంతక రసాయనాలు వాడకూడదు. వీటితో చర్మ సంబంధ వ్యాధులతో పాటు కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే సహజసిద్ధమైన గోరింటాకు పొడి, కుంకుమ, పసుపు, టమాటా గింజలు, మోదుకు పూల పొడితో తయారు చేసిన రంగులతో వేడుకలు జరుపుకోవాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే..

హోలీ సంబురాలు కుటుంబాల్లో విషాదం నింపకుండా చూసుకోవాలి. ఏటా జిల్లాలో ఏదో ఒక చోట చెరువులు, వాగులు, కుంటల వద్దకు స్నానానికి వెళ్లి నీటిలో మునిగిపోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చెరువులు, జలాశయాల వద్ద సెల్ఫీలు దిగడం.. సరదాలకు పోయి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కాస్త జాగ్రత్తలు పాటిస్తే.. పండుగలను సంతోషంగా మార్చుకోవచ్చు. ఈతకు వెళ్లేవారు చెరువులోతు ఎంత ఉంది.. ఎక్కడ గోతులున్నాయో తెలుసుకోవాలి. ఏమీ తెలియకుండా అందులో దూకితే బండలు, ముళ్ల కంపలతో ప్రాణాపాయం ఉంటుంది. మద్యం సేవించి నీటిలో ఎట్టి పరిస్థితుల్లో దిగకూడదు. ఈత రాకుంటే అటు వైపే వెళ్లొద్దు.

సూచనలు

హోలీ ఆడటానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం. దీని వల్ల రంగులు శరీరానికి సరిగా పట్టుకోవు ఇంకవు. దీంతో రంగులను శుభ్రం చేసుకోవడం చాలా సులభమవుతుంది. చాలా మంది రంగుల్లో వివిధ ఆయిల్స్ కలిపి రాస్తుంటారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది.

కెమికల్స్ రంగులు వద్దు



రంగుల పండుగ మోజులో కెమికల్స్ కలిపిన కలర్లను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. మనపై చల్లే రంగుల నుంచి వచ్చే పొగ కడుపులోకి పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడతారు. రంగులు ఎక్కువగా కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావచ్చు. అలాగే స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. ప్రకృతి సహజసిద్ధమైన రంగులతో పండగ జరుపుకుని, ఆరోగ్య వంతమైన జీవితం గడపాలి.

\- వనం శ్రీనివాస్, ఎండీ సివిల్ సర్జన్

నీటితో ఆటలొద్దు



రంగుల పండుగ పూర్తయిన తర్వాత చాలామంది యువకులు, పెద్దలు స్నానం కోసం చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. స్నేహితులతో కలిసి రంగుల పండుగ జరుపుకున్న తర్వాత, ఇంటి వద్దనే ఫ్రెష్ కావాలి. జలకాలాట కోసం చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. చెరువులు, కుంటల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా పూడిక తీత పనులు చేపట్టడం వల్ల పెద్ద పెద్ద గుంతలు ఉండే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లో సాహసం చేయరాదు. పోలీసులు సైతం ప్రతీచోట నిఘా వేసి ఉంచారు.

\- ఎలబోయిన శ్రీనివాస్, సీఐ,జనగామ

గంజాయి విక్రయదారుల అరెస్ట్

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామన్నపేట: వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయ్ విక్రయాలపై అందించిన మేరకు ఇంతేజార్ గంజ్ పోలీసులతో సోమవారం సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. వరంగల్ బస్టాండ్ సమీపంలో పావురాల రమేశ్, బండెల సాయికుమార్, మహ్మద్‌చాంద్ పాషా, మహ్మద్ సమీర్‌లు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన క్రమంలో విక్రయదారుల నుంచి 500 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం వారిని విచారించగా తాము కామన్ ఫ్రెండ్స్ అని రెండు సంవత్సరాల నుంచి గంజాయి తాగడం, అమ్మడం అలవాటుగా ఉందని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయిని సుమంత్, సాయి, విక్కీల నుంచి పలుమార్లు కొనుగోలు చేసినట్లు తెలిపారని వివరించారు. ప్రస్తుతం ఆ ముగ్గురి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలోని పావురాల రమేశ్‌పై వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబాబాద్‌లతో పాటు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లలో 23 కేసులు ఉన్నట్లు తెలిపారు.



అరెస్టు చేసిన నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

హసన్‌పర్తి/గీసుకొండ: కడుపునొప్పి భరించలేక ఒకరు, తాగుడుకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది ఓ ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన శీలం రామరాజు(42) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా రామరాజు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పతి సిబ్బంది సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన ఆడెపు రాజు(32) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు..



మృతిచెందిన సర్వర్

మహబూబాబాద్ రూరల్ :అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టౌన్ ఎస్సై రవి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కంకర బోర్డ్ ప్రాంతంలో నివాసం ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు సర్వర్ (52) మూడు రోజులుగా ఇంట్లోనే ఉన్నాడు. ఈ నెల 4వ తేదీన పని మనిషి ఇంట్లో పనిచేసేందుకు వెళ్లగా సర్వర్ తనకు ఆరోగ్యం బాగోలేదని ఇంటి బయట వరకు ఊడ్చి వెళ్లిపొమ్మని పనిమనిషితో చెప్పాడు. మూడు రోజుల అనంతరం మళ్లీ సోమవారం ఉదయం పని మనిషి పనిచేసేందుకు వెళ్లగా ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండగా ఆమె స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఇంటి తలుపులు తెరిచి వెళ్లి చూసేసరికి సర్వర్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి సోదరుడు యాకుబ్ జాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సర్వర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు. సర్వర్ శనిగపురం ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ కలహాలతో మృతుడి భార్య, కుమారుడు, కుమార్తె కొంత కాలంగా ఆయనకు దూరంగా ఉంటున్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి..



సిద్ధిరాములు(ఫైల్)

బచ్చన్నపేట: వ్యవసాయ బావుల వద్ద శిథిలావస్థలో ఉన్న దేవతల గుడిని మరమ్మతులు చేయించేందుకు ఇటుక తీసుకురావడాని వెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి గొడుగు సిద్ధిరాములు(48) మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొడవటూర్ సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం...సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు గ్రామమైన బంజేరుకు చెందిన సిద్ధిరాములు వ్యవసాయ బావి వద్ద అమ్మవారి దేవాలయం ఉంది. మరమ్మతులు చేపించేందుకు ఇటుకను తీసుకురావడానికి సొంత ట్రాక్టర్‌లో పెద్దనాన్న కుమారుడు గొడుగు అయిలయ్యతో మండల పరిధిలోని కొడవటూర్‌కు సిద్ధిరాములు బయలుదేరాడు. గ్రామ సమీపానికి ట్రాక్టర్ చేరుకోగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో రాములు పడగా అతడిపై ట్రాక్టర్ పడిపోయింది. అయిలయ్య పక్కకు దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి అతన్ని చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు. మృతునికి భార్య రేణుక, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



శరత్(ఫైల్)

వాజేడు: మద్యానికి బానిసై మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడి మృతదేహం గోదావరిలో కనిపించింది. ఈ ఘటన ములుగు జిల్లాలోని వాజేడు మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై రేఖ అశోక్, బంధువుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పూనెం శరత్(26) 3వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాక పోవడంతో మద్యానికి బానిస కావడం, మతి స్థిమితం సరిగా లేక పోవడంతో బంధువుల ఇళ్లలో ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. తెల్లారినా ఇంటికి రాకపోవడంతో కుంటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకడంతో పాటు బంధువులను అడిగి తెలుసుకున్నారు. అయినా అతని ఆచూకీ లభించలేదు. గోదావారి ఒడ్డున అతని చెప్పులు కనిపించడంతో గోదావరిలో సైతం గాలించగా ఆచూకీ లభించలేదు. కానీ సోమవారం ఉదయం గోదావరిలో శరత్ మృతదేహం కనిపించింది. మృతుడి తల్లిదండ్రులు పూనెం రమణ, కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు



కేటీఆర్ సభకు భారీసంఖ్యలో తరలించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: ఈ నెల 8న మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని తొర్రూరు మండల కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సభకు పాలకుర్తినుంచి భారీ సంఖ్యలో మహిళలను తరలించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తినుంచి 4వేల మంది మహిళలను తరలించాలని సూచించారు. తొర్రూరు సభలో మంత్రి కేటీఆర్ చేతులమీదుగా రుణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఆదనపు పీడీ నూరోద్దిన్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పాలకుర్తి సర్పంచ్ వీరమానేని యాకాంతరావు, ముస్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హెలిపాడ్, సభాస్థలి పరిశీలన

వరంగల్(పర్వతగిరి): నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏనుగల్‌లో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రానుండగా సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, కలెక్టర్ గోపి హెలిపాడ్ సభా స్థలం, పార్కింగ్ స్థలాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు.

దేశాయిపల్లివాసికి తమిళనాడులో ప్రమాదం..

- ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి తీవ్రగాయాలు
- ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



తమిళనాడులో చికిత్స పొందుతున్న రజినీకుమార్

దుగ్గొండి: తమిళనాడు రాష్ట్రంలో ప్రమాదవశాత్తు ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లికి చెందిన కందికొండ రజినీకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ప్రభుత్వ ఆస్పత్రిలో చావు బతుకుల మధ్యన కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే..రజినీకుమార్ గత కొన్ని సంవత్సరాలుగా తమిళనాడు రాష్ట్రంలోని ట్యుటికోరిన్ జిల్లా కేంద్రంలో ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం విధులు నిర్వర్తిస్తుండగా యాసిడ్‌తో నిండి ఉన్న గాజు బాటిల్ పేలిపోయింది. దీంతో గాజు ముక్కలు రజినీకుమార్ పొట్టకు గుచ్చుకున్నాయి. యాసిడ్ పొట్ట, కాళ్లు, చేతులపై పడటంతో తీవ్రంగా కాలిపోయాయి. వెంటనే అతన్ని సిబ్బంది ట్యుటికోరన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు..

అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్ది హామీ

రజినీకుమార్ ఆరోగ్య పరిస్థితిని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వెంటనే రజినీకుమార్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ట్యుటికోరన్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తమిళనాడు వైద్యుల అనుమతితో రోగిని తన సొంత ఖర్చులతో విమానంలో హైదరాబాద్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ నుంచి ఎల్ఓసీ ద్వారా యశోద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు రజినీకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హోలీ ఆడుకునేందుకు వెళ్లి వచ్చి..

- నీటి సంపులో పడి బాలుడు మృతి

గార్ల: హోలీ ఆడుకునేందుకు వెళ్లివచ్చి ఇంటి ఆవరణలోని నీటి సంపు వద్దకు కాళ్లుచేతులు కడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గార్ల మండల పరిధిలోని చవిటి తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చవిటితండాకు చెందిన గుగులోత్ కుశాంత్‌కుమార్(4) తోటి స్నేహితులతో కలిసి హోలీ ఆడుకుని ఇంటికి వచ్చాడు. ఇంటి ఆవరణలోని నీటి సంపువద్దకు కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిసంపులో పడిపోయాడు. బాలుడి తండ్రి వీరన్నకు కిరాణం షాపు ఉండడంతో బిజీగా ఉన్నాడు. రాత్రి పడుకునేముందు కుమారుడు ఇంకా రాలేదని స్నేహితుల వద్దకు వెళ్లి ఆరా తీయగా రాత్రి 8గంటలకే ఇంటికి వచ్చాడని తెలిపారు. అనంతరం తండా అంతా తిరిగి ఇంటికి వచ్చిన తండ్రి నీటి సంపులో చూడగా మునిగిపోయి ఉన్నాడు. కొన ఊపిరితో ఉన్న కుమారుడిని వెంటనే చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృత్యువాత పడ్డాడు. సోమవారం ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. బాలుడిపై పడి తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. బాలుడి తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.



కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి



కుశాంత్‌కుమార్ (ఫైల్)

కొండచిలువల కలకలం

- నాలుగింటిని స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు

రాయపర్తి: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు వెనుకాల ఉన్న గొల్లకంచ ఎస్సారెస్పీ కాల్వలో నాలుగు కొండ చిలువలు సోమవారం కలకలం రేపాయి. వీటిని గమనించిన రైతులు సర్పంచ్ గారె నర్సయ్యకు సమాచారం అందజేశారు. వెంటనే సర్పంచ్ ఫారెస్ట్ అధికారులకు చేరవేయడంతో ఫారెస్ట్ టెక్నికల్ అసిస్టెంట్ రాజు పాములు ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఈ కాల్వలో స్థావరం ఏర్పాటు చేసుకుని ఉన్నట్లు గమనించిన వారు జేసీబీ సాయంతో వాటిని బయటికి తీసి గోనె సంచుల్లో భద్రపరిచారు. వాటిని రిజర్వు ఫారెస్ట్‌లో వదులుతామని ఫారెస్ట్ అధికారి తెలిపారు. ఇందులో రెండు కొండ చిలువలు ఆరు నుంచి ఎనిమిది అడుగులు ఉండగా మరో రెండు పాములు మూడు నుంచి నాలుగు అడుగులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, పంచాయతీ కార్యదర్శి అశోక్ నాయక్, వార్డు సభ్యుడు పోగులకొండ వేణు, రైతులు నల్లబింగి సాయిలు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.





భారీ కొండచిలువను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు (ఇన్‌సెట్‌లో) మిగితా మూడింటిని సంచుల్లో తీసుకెళ్తున్న అధికారులు

280 మద్యం బాటిళ్లు పట్టివేత

- నిందితుడి ఆరెస్ట్

ఖిలా వరంగల్: రైలు మార్గం ద్వారా వరంగల్ మహానగరానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి 90ఎంఎల్ సైజ్ గల 280 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మండల ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం రాత్రి ఖిలా వరంగల్ మండలం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఆదేశాల మేరకు రైల్వే మార్గం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ నగరానికి పెద్ద ఎత్తున మద్యం, ఎండు గంజాయి దిగిమతి అవుతుందని పక్కా సమాచారం అందిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్‌శాఖ అధికారులు నిఘా వేసి ఉంచారు. ఓ వ్యక్తి రైలు దిగి శివనగర్ వైపు వెళ్లే ప్రాంగణానికి చేరుకున్నాడు. ప్రయాణికుల బ్యాగులు ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. అందులో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నక్కలగుట్ట తండాకు చెందిన ధారవత్ శ్రీకాంత్ బ్యాగును పరిశీలించగా బ్యాగులో సుంకం చెల్లించని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 280 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వెంటనే అతన్ని అరెస్ట్ చేసి రూ. 23వేల విలువైన బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై బి.సరతి, హెడ్‌కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుళ్లు ఎ.చిరంజీవి, బి.కరుణాకర్, అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



బాటిళ్లను స్వాధీనం చేసుకుని శ్రీకాంత్‌ను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు